విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 22 నవంబరు 2024 8 పేజీలు

విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలి

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - రామకుప్పం: విద్యార్థులకు బాధ్యమైన విద్యతో పాటు పరిసరాల పరిశుభ్రతను పరిరక్షించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మరియు కుప్పం కడా ప్రత్యేక అధికారి వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మసముద్రం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను అకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొని ఉన్న సమస్యలను స్వయంగా చూసి అసహనం వ్యక్తం చేశారు.

2

చలి కాలం.. జర భద్రం..!

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ దాడి
- పెరుగుతున్న న్యుమోనియా, ఆస్తమా కేసులు

విశాలాంధ్ర-తొట్టంబేడు : చల్లటి వాతావరణంతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ జ్వరం, ఆయాసం, స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. ఆస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్), అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యాధులతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆస్పత్రుల ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో సీజన్‌కు సంబంధించిన కేసులు పెరుగుతు న్నాయి. తేమ శాతం వాతావరణ మార్పులతో చల్లటి గాలులకు శరీరం తెల్లగా పొడిబారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి, ముఖం కాంతి హీనంగా మారుతోంది. అరికాళ్లు పగుళు ఏర్పడుతున్నాయి. శరీ రంలో తేమ శాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయం టున్నారు. ముఖంపై పొడిబారిపో వడం వల్ల పగుళ్లు వస్తాయని వైద్యులు చెబుతు న్నారు. చేతులపై పగుల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయం టున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందు లుంటాయని, ఇన్‌ఫెక్షన్ పెరుగుతుందని పేర్కొం టున్నారు. దగ్గు, ఆయాసం వాతావరణం చల్లగా ఉండడడంతో ప్రజలు 'సీవియర్ అలర్జీ బ్రాంకైటిస్' బారినపడుతున్నారు. వాతావరణం మార్పుతో వైరస్ శక్తివంతం కావడంతో ప్రజలపై దాడి చేస్తోంది. దీంతో దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. న్యుమోనియా, అస్తమా వంటి జబ్బులు కూడా పెరుగుతున్నాయని వైద్యులు అంటున్నారు.

అస్తమా, న్యుమోనియాతో బాధపడేవారు మందులు వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నీరు వేడిచేసి తాగాలిశ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్న వారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతు నొప్పి ఉన్న వారు ప్రతిరోజూ రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి. ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు. వేడి ఆహారం తీసుకో వాలి. ఈఎన్‌టీ సమస్యలున్న వారు వైద్యులను సంప్రదించి వారి సలహాలు పాటించాలి. గుండె జబ్బు బాధితులు జాగ్రత్త..! చలికా లంలో గుండె జబ్బులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్, కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండడంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది.

2లో

అస్తమా ఉంటే అవస్థే..!

ఆస్తమా, న్యుమోనియా, సీవోపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారికి చలికాలం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా ఆస్తమా సమస్య పెరుగుతుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే ఆస్తమా, న్యుమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

తిరుమల తరహాలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

– పంచమి తీర్థానికి విస్తృతంగా ఏర్పాట్లు
– టీటీడీ ఈవో జె.శ్యామలరావు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను నవంబరు 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గురువారం సాయంత్రం ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థం రోజు భక్తులకు చక్కటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హోల్డింగ్ పాయింట్లలో ఉండే వేచి ఉండే భక్తులకు సౌకర్యవంతంగా మంచినీరు, అల్పాహారంతో పాటు మరుగుదొడ్లను కూడా అందుబాటులో ఉంచేందుకు ముంద స్తుగానే ప్రణాళిక చేసుకోవాలన్నారు. హోల్డింగ్ పాయింట్ల వద్ద అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుని స్థానిక పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవా ల న్నారు. వైద్య విభాగం అధికారులు ప్రథమ చికిత్స కేంద్రాలను, అంబులె న్సులను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

2

కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదంచేయండి

– శ్రీకాళహస్తిలో కరపత్రం విడుదల చేసిన ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: రైతు సంఘాల సమన్వయ సమితి, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రంలో ప్రజాసంఘా లన్నింటినీ కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం 26న 26 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద మహా ధర్నాకు పిలుపునిచ్చాయి ఈ సందర్భంగా గ్రామ గ్రామాన కర పత్రాలు పంపిణీ కార్యక్రమానికి ప్రజా సంఘాలు శ్రీకారం చుట్టాయి సిపిఐ ప్రజాసంఘాల ముఖ్య నాయకుల కాళహస్తిలో కరపత్రాల విడుదల కార్యక్రమం చేశారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ గ్రామంలో ఇంటింటికి కరపత్రం చేరాలని చిన్నపాటి సమావేశాలు నిర్వహించి ఈ కార్యక్రమం ఎందుకు చేస్తున్నామో రైతాంగానికి ప్రజలకు మరీ ముఖ్యంగా మహిళలకు వివరించే కార్యక్రమం చేపట్టాలని వారు తీర్మానించడం జరిగింది.

2

రోడ్లు గుంతలమయం

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : సమయం చాలా విలువైనది. అంతకంటే విలువైనది ప్రాణం ఎందుకంటే సమయం ఖర్చు చేసిన తర్వాత తిరిగి పొందలేము. ప్రతి ఒక్కరికి వారి లక్ష్యాలను సాధిం చడానికి, వారి బాధ్యతలను నెరవేర్చడానికి సమయం కావాలి. సమయం లేకుండా, ఇంకేమీ సాధించలేము లేదా అనుభవించలేము.

2

విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలి

(మొదటి పేజీ తరువాయి) పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం భోజన పథకంపై విధ్యార్ధులను అడిగి తెలుసుకున్నారు. భోజనా వసతి పై ణాన్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, సీతాపతి, మునస్వామి, చిన్నికృష్ణ, చలపతి, మహమ్మద్ రఫీ, ఆదిల్ బాషా, మరియు మండల తహసిల్దార్ బాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర భద్రం..!

(మొదటి పేజీ తరువాయి) కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవుతుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు, అస్తమా, గుండె జబ్బులున్న వారు వాకింగ్ విషయలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి. స్మోకింగ్, విషపదార్థాల వల్ల ముప్పు ఏర్పడుతుంది. ఆల్కహాల్ తీసుకుంటే గుండె సమస్యలు వస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ బాధితులు అప్రమత్తంగా ఉండాలి. మధుమేహ రోగులు చల్లటి ప్రదేశంలో పడుకోవద్దు. పొగమంచు బారిన పడకుండా ఉండడానికి మాస్కులు ధరించాలి. గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. చలిగాలి ఉన్న సమయంలో వృద్ధులు బయట తిరగొద్దు.

బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి) సెక్యూరిటీ విభాగం అధికారులు సీసీ కెమెరాలను, అవసరమైనంత సిబ్బందిని ఏర్పాటు చేసుకుని స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశాంచారు. భక్తులందరికీ అన్నప్రసాదం విరివిగా అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా నిర్వహించే స్టేజ్ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నాణ్యమైనవిగా ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైట్ వాష్, కలర్ పెయింటింగ్, ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఆర్చిలు ఏర్పాటు చేసి హారితి పాయింట్స్ కోసం లైన్ లు, బారికేడ్లు, చైన్ లింక్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో తిరుచానూరులో ఫల, పుష్ప ప్రదర్శనను భక్తులు ఆకట్టుకునేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో ఈవో గోవింద రాజన్, ఇతర తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదంచేయండి

(మొదటి పేజీ తరువాయి) అలాగే పట్టణ ప్రాంతాలలో ఆటో స్టాండ్ ల వద్ద హమాలి సెంటర్ల వద్ద వాకింగ్ సెంటర్లలో వీధి వర్తక వ్యాపారం చేసుకుంటున్న కూడలి వద్ద భవన నిర్మాణ కార్మికులు ఉండే ప్రదేశాలలో విస్తృతంగా కలపత్రాల పంపిణీకి ప్రణాళిక రూపొందించడం జరిగింది జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేయడం కోసం.. సాగు చేయడానికి కావలసిన రుణ సదుపాయం కోసం.. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కోసం ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం.. మహిళా మణులకు డ్వాక్రా రుణాలు బ్యాంకు నుండి విరివిగా ఇవ్వడం కోసం తల్లికి దీవెన అమ్మకు వందనం మహిళలకు ఆసరా పథకాల పేర్లు ఏవైనా మహిళల చేతికి డబ్బులు అందరమే ప్రధాన ఉద్దేశంతో ఈ యొక్క ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా తీసుకెళ్లడానికి ప్రణాళిక రూపొందించడం జరిగిందని వారు అన్నారు అందుకోసం 26వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం యువత విద్యార్థి మహిళ మేధావి వర్గం కళాకారులు అందరూ పెద్ద ఎత్తున కదలి రావాలి అని కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాతో రాష్ట్ర ప్రభుత్వం దిమ్మ తిరిగే సమాధానం చెప్పాలని ప్రజల్లో.. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం కృషి చేయాలి అని వారు పిలుపునిచ్చారు ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి ప్రజానాట్యమండలి కార్యదర్శి చిన్నం పెంచలయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ప్రజా సంఘాల నాయకులు. కత్తి రవి. వైయస్ మనీ. కత్తి ధర్మయ్య. తులసి రాజన్ శివకుమార్. మల్లికార్జున్. మరియు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు గుంతలమయం

(మొదటి పేజీ తరువాయి) అందువల్ల, సమయం మానవ అనుభవానికి చాలా అవసరం మరియు అన్నిటికంటే విలువైనది. జీవితం అన్నింటికన్నావిలువైనది సమయం, అందరికీ అవసరమైనది. సమయాన్ని సరిగా వాడుకుంటే ఇంకేదీ అవసరం లేదు. ఆ సమయం బ్రతుకు బాటలో జీవన పయనంలో మానవ జీవితం కొనసాగుతున్నది.ఇటీవల కురిసినవర్షాలకు తడ శ్రీకాళహస్తి రహదారి గుంతలు ఏర్పడడంతో రాకపోకలు కొనసాగిస్తున్న ప్రయాణికులు ఆందోళన కలిగిస్తున్నది.రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. వర్షానికి రోడ్డు బాగా అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గుంతలుపడి కంకర తేలి అధ్వానంగా మారిన రోడ్డు మరమ్మతు నోచుకోలేదు. సత్యవేడు నియోజ కవర్గం లో శ్రీ సిటీ లో పరిశ్రమలు ఉన్నాయి, బ్రదర్ తెరువు కోసం ఆ పరిశ్రమల యందు కార్మికు లుగా జీవనం కొనసాగిస్తున్న యువకులు ద్విచక్ర వాహనంపై రాకపోకలు కొనసాగిస్తున్నారు.రాత్రి సమయంలో ఈ రోడ్డు మార్గంగుండా వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకునివెళాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుండి శ్రీ సిటీకి అధిక సంఖ్యలో భారీ వాహనాలు రకరకాల సామాగ్రితో రాకపోకలు పరిశ్రమలో తయారైన వివిధ రకాల సామాగ్రి తడ నుండి శ్రీకాళహస్తి మీదుగా బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు సంఖ్య పెరిగిపోయింది.పరిశ్రమలకి ముడిసరుకు తోపాటు వారు తయారుచేసే పలు రకాల వస్తువులు భారీ వాహనాల్లో అధికలోడ్‌తో వెళుతుంటాయి భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసం అయింది. రోడ్డు గుంతల మయంకారులతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ప్రైవేట్ పరిశ్రమలకు కార్మికులు తీసుకు వెళుతున్న ప్రైవేటు బస్సులు షిఫ్ట్ ప్రకారం కార్మికులతో ప్రయాణం కొనసాగిస్తుంటాయి, కార్మికులతో వెళ్లే బస్సు ప్రయాణం కార్మికులకు ఆందోళన కలిగిస్తుంది. ద్విచక్ర వాహనం, కార్లు ఎక్కువ సంఖ్యలో ప్రయాణం కొనసాగిస్తున్నారు, ప్రతిరోజు ఈ రహదారి మీదుగా వందలాదిమంది వాహనదారులు వెళుతుంటారు రోడ్డుపై గొంతులు తప్పించి చాలామంది ప్రమాదం బారిన పడుతున్నారు మరికొందరు ప్రాణాలు సైతం పోగొట్టుకున్న సందర్భాలు సంఘటనలు చోటుచేసుకుని ఉన్నాయి,అయినా అధికారుల్లో చలనం లేదు. మీచావు మీరు చావండి అన్నట్లు రోడ్డు భవనాల శాఖ వారు వ్యవహరిస్తూ రోడ్డు మరమ్మ తులను పట్టించుకొనేవారే కరువయ్యారు. ధ్వంసమైన రోడ్డును బాగుచేసి ప్రయాణికులకు కార్మికులకు జీవితాలను నిలబెట్టాల్సిన అవసరం అధికారులకు ఎంతైనా ఉంది.

సారా రహిత జిల్లాగా మార్పులు తీసుకొస్తాం

– గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెడతాం

– బెల్టుషాపులపై ఉక్కుపాదం తప్పదు – ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయక శేఖర్

విశాలాంధ్ర – కార్వేటినగరం: చిత్తూరు జిల్లాను సారా రహిత జిల్లాగా మార్పులు తీసుకు రావడమే లక్ష్యంగా ఎక్సైజ్ సిబ్బంది పని చేస్తోందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయ శేఖర్ అన్నారు. గురువారం ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా అమ్మకాలు, తయారీలు లేకుండా అరికట్టేందుకు ఎక్సై సిబ్బందిని సిద్ధం చేస్తున్నామన్నారు. బెల్లు షాపులు ఏరివేత దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచి సరిహద్దు ప్రాంతాలలో దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి విక్రయాలను ఆరికట్టేందుకు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల అధికారులతో మాట్లాడి గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.మాదక ద్రవ్యాలు సేవించిన, అమ్మకాలు జరిపినట్లు తెలిసిన కేసులు నమోదు. చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసిన షాపుల లైసెన్స్ లను రద్దు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేయకుండా అటవీశాఖ అధికారులు కూడా సహకరించాలని, అనుమానం ఉన్న ప్రాంతాలను తమ ఎక్సైజ్ శాఖ దృష్టికి తీసుకొచ్చి నివారణకు సహకరించాలని కోరారు. అక్రమ సారా తయారీలపై పోలీస్ సిబ్బంది విస్తృత్తంగా దాడులు నిర్వహిస్తున్నాయి. అయితే ఎక్సైజ్ అధికారులు ఎక్కడ దాడులు నిర్వహించనట్లు సమాచారం లేదని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ను వివరణ కోరగా ఎక్సైజ్ శాఖలో సిబ్బంది కొరత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీ.ఐ శిరీషాదేవి, ఎస్.ఐలు. సిబ్బమది పలువురు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-ఏర్పేడు: బండారుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్లోపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యంకు ఇటీవల రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయుడుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు విద్యాశాఖా మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బండారుపల్లి పాఠశాలలో గురువారం మండల విద్యాశాఖఅధికారి దయాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల్ కుమార్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ మండల కో ఆర్డినేటర్ శిరీష, వారి బృదం వారిచే ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు కూడా పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవ అవార్డును అందుకున్న సుబ్రహ్మణ్యం సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం రమేష్, ద్వారకానాథ్ రెడ్డి, కుమార్ రాజా, రాధాకుమారి, ఉమామహేశ్వర్, రామచంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

Notice

IN THE COURT OF THE VADDL.DIST.JUDGE:: GUNTUR

M.V.O.P.No.242/2020

Between:

Yerrabothula Koteswara Rao -Petitioner

And

M.Penchalaiah& Others - Respondents

To,

R-1:M.Penchalaiah, S/o. Nagaiah, R/o D.No. 1-177, Peruru Village, Thiripathi Mandal, Chittoor District (Driver of the RTCBus Bearing No. AP 27 TX 1262)

పై నెంబరు ఓ.వి.లోని పిటీషనర్ యాక్సిడెంటులో తనకు తగిలిన దెబ్బలకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచు న్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.**16-12-2024**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం. 10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిచో మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది: **16-12-2024**

వై.రిషికేష్ రెడ్డి,
పిటీషనర్లు తరపు న్యాయవాది, గుంటూరు,
సెల్: **94405 77242**

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా మా కక్షిదారుడైన **శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెండ్** బాంచ్ మేనేజర్, తిరుపతి బ్రాంచ్ వారి సూచనలమేరకు ఇచ్చిన బోగట్టా ప్రకారం చిత్తూరు జిల్లా, భైరాగిపట్టెడ, డి.నెం.19-44-ఎస్ 7-1252, తిరుపతి టౌన్, పోస్ట్ & మండలంలో కాపురముండు పెనుబాల హర్షవర్ధన్, తండ్రి లేట్ పెంచలయ్యకి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి లింక్ డాక్యుమెంట్స్ నెం.1589/1984 తేది 27-10-1984, 1567/1988 తేది 14-09-1988, స్థిరాస్తికి సంబంధించిన లింక్ డ్యాకుమెంట్స్ దారిపోయినవి. సదరు డాక్యుమెంట్స్ ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు డాక్యుమెంట్స్ ద్వారా సి.లోకేష్ ఈ క్రింది షెడ్యూలుపై నకలు పత్రము ద్వారా లోన్ మంజూరు చేయుటలో ఎవ్వరికైననూ ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఏడు రోజులలోగా మీకు గల అభ్యంతరములను వ్రాతపూర్వకముగా తెలియపరచవలసినది. లేని ఎడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి లోను మంజూరు చేయబడును.

షెడ్యూలు : కడప.డి., పుల్లపేట సబ్ డి.లో చేరిన కోడూరు మండలం, కోడూరు గ్రామ పంచాయితీకి చెందిన 10వ వార్డులోని పెనుబాల పెంచలయ్య ఏరియాలో కోడూరు గ్రామపొలం సర్వేనెం. 38పైకి డోర్ నెం.10/569, 10/570, 10/570-1గా గల ఆర్.సి.సి. మిద్దె ఇంటికి హద్దులు తూర్పు : పంచాయితీ రోడ్డు, ఉత్తరం : పంచాయితీ రోడ్డు, పడమర : పంచాయితీ రోడ్డు, దక్షిణం : చవన సంద్యారాణి జాగా & మిద్దె ఇళ్ళు, తూర్పు - పడమర : 72 అ॥లు, ఉత్తరం - దక్షిణం : $37^1/_2$ అ॥లు అనగా 300 చ॥గ॥లు గల జాగా

నగరం సునీల్ కుమార్,అడ్వకేట్,కుమ్మరితోపు,తిరుపతి

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - గూడూరు : విద్యార్థిని, విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిం చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ భాస్కరరావు తెలిపారు . గూడూరు పట్టణంలోని ఎస్కేఆర్ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న విక్రమ సింహపురి ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ భాస్కరరావు విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో సుమారు వంద కళాశాలలు ఉండగా అతి తక్కువ సంఖ్యలో ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్ లో క్రీడాకారులు పాల్గొనడం బాధాకరంగా ఉందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడ ఆసక్తిని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు . అనంతరం ఆయన టోర్నమెంట్ ను ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ సునీత , కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ అధ్యాపకులు నారాయణ రాజు వెంకట్రాయలు , వెంకటేశ్వర్లు శ్రీధర్మ శర్మ , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

పురుగుమందుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : రైతులకు న్యాయమైన విత్తనాలు పురుగుమం దులు విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి భారతి పురుగు మందుల దుకాణయాజమాన్యం ను హెచ్చరించారు.మండల కేంద్రంలోని పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి భారతి గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో దుకాణంలో ఉన్న నిలువులకు తగినట్లు రికార్డులు నిర్వహణ పరిశీలించారు, ముఖ్యంగా గుళికలు ప్యాకెట్లను తయారుచేది ముగిం పు తేదీలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణ యాజమాన్యంతో మాట్లాడుతూ రబీ సీజన్ లో అధిక శాతం రైతులు ఎరువులు విత్తనాలు పురుగుమందులు కొనుగోలు చేస్తారు వారికి న్యాయమైన సరుకులు అందించాలనిరాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశమన్నారు. పురుగు మందుల దుకాణాల్లో రికార్డులలో నిల్వ రిజిస్టర్, అమ్మకం రసీదులు, దుకాణంలో ఉన్న సరుకులు సరిపోయే లేదని పరిశీలించారు, వ్యవసాయ శాఖ సూచించిన నాణ్యమైన పురుగుమందులనే ఎంఆర్పీ రేట్లకే విక్రయించాలని సూచించారు. నాసిరకం మందులను అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం లారీ బోల్తా - డ్రైవర్‌కు గాయాలు

విశాలాంధ్ర - తడ : పాండిచ్చేరి నుండి విశాఖపట్నం కు బీరు బాటిల్ ను తరలించే మద్యం లారీ తడ మండల పరిధిలోని అక్కంపేట జోడు చెరువుల వద్ద బోల్తా పడటంతో లారీ డ్రైవర్‌కు గాయాలు పాలైన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పాండిచ్చేరి నుండి విశాఖప్నంకు బుధవారం 1800 కేసులు సుమారు 2 కోట్ల విలువ చేసే బీర్ బాటిల్‌ను తీసుకువస్తుండగా గురువారం తెల్లవారు జామున లారీ డ్రైవర్ నిద్ర మత్తులో అక్కంపేట జోడు చెరువుల వద్ద లారీ తిరగబడటం తో బీరు సీసాలు కొంత పగిలి చెరువు నీటిలో కలిశాయి . తమిళనాడు కు చెందిన డ్రైవర్ సేటు కు ఎడమకాలు ప్రాక్చర్ కావడం తో స్థానికులు డ్రైవర్ సేటు ను సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్య శాలకు 108 వాహనం ద్వారా తరలించారు సమాచారం అందుకున్న తడ ఎస్ ఐ కొండప నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రోహిబిషన్ అధికారులకు తెలియజేయడం తో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు తడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజీవ్ నగర్‌లో అక్రమాల అంతు తేలుస్తాం

- తహసిల్దారు లక్ష్మీనారాయణ



విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్ నగర్ లో అక్రమాల అంతు తెలుస్తామని తహసిల్దారు లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలనీలో చోటు చేసుకున్న ఆక్రమణలపై ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు సెప్టెంబర్ నెలలో 54 బృందాలుగా ఏర్పడి సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సర్వే సందర్భంగా రాజీవ్ నగర్లో 6,300 ఇళ్ల స్థలాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా2వేల మందికి పైగా పట్టాలు పొంది లబ్ధిదారుల ఆచూకీ లభించలేదన్నారు. రికార్డులను సర్వే అనంతరం సమగ్రంగా పరిశీలించి ఆ మేరకు నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలు ఆక్రమణకు గురైనా..నిర్మాణ పనులు చేపకట్టకపోయినా.. వివరాలను ఈనెల 30వ తేదీ ఆఖరి గడువు లోపల సమర్పించాలని కోరారు. లేనిపక్షంలో అనర్హత వేటు వేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధికారులకు సహకరించి తమ స్థలాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ వివరాలకు సేకరణకు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - పుంగనూరు: మండలంలోని పాలెం పల్లి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు నియోజకవర్గంలో అందరికీ ఆప్త మిత్రుడు ప్రజల మనిషి కృష్ణా నాయక్ ను రాష్ట్ర ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కో-ఆపరేటివ్ డైరెక్టర్గా ఎంపిక చేయడంతో పట్టణ మరియు మండలంలోని టిడిపి నాయకుడు ఆయనను ఆయన నివాసంలో గురువారం రోజున ఘనంగా సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కృష్ణా నాయక్ మాట్లాడుతూ పార్టీలో నేను పడిన కష్టాన్ని గుర్తించి నాకు ఈ పదవి కట్టబెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు మరి ముఖ్యంగా ఈ పదవి రావడానికి సహకరించిన మా నియోజకవర్గ ఇన్చార్జి వర్యులు చల్లా రామచంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయనకు యూత్ కాలం రుణపడి ఉంటానని తెలియజేశారు నాకు ఇచ్చినా పదవికి వన్నె చేస్తూ ప్రభుత్వానికి పార్టీకి మంచి పేరు తీసుకు రావడం జరుగుతుందన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు అందర్నీ సమన్వయం చేసుకొని పార్టీని బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తేవడం జరుగుతుందన్నారు కార్పొరేషన్ ద్వారా గిరిజనుల సంక్షే మానికి కృషి చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి నాయకులు సీవీ రెడ్డి పోలీస్ గిరి శ్రీకాంత్ సమీపతి యాదవ్ సయ్యద్ సుహేల్ భాష గంగాధర్ రామకృష్ణ నాయక్ శ్రీనివాసులు నాయక్ చైతన్య రాయల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలను తొలగించిన అధికారులు

విశాలాంధ్ర - కార్వేటినగరం : విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలను విద్యుత్ అధికారులు నిలువెల్లా అల్లుకున్న నిర్లక్ష్యం గురువారం రావడంతో స్పందించి గురువారం మండలంలోని టీకేయంపేట జగనన్న కాలనీ వడ్డీ ఇండ్ల దగ్గర విద్యుత్ స్తంభానికి అల్లుకొని ఉన్న తీగలను విద్యుత్తు అధికారులు తొలగించారు. ఈ సంద ర్భంగా విద్యుత్తు ఎ డి ఈ కె చంద్రబాబు మాట్లాడుతూ మండలం లోని విద్యుత్తు స్తంభాలకు తీగలు అల్లుకొని ఉన్నచోట హాయా ఏరియా లైన్మెన్లు పర్యవేక్షించి తక్షణమే తొలగిం చాలని ఆదేశించారు. ఎవరికి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఎక్కడైనా విద్యుత్తు వైర్లు వేలాడుతుంటే, విద్యుత్ స్తంభాలు పడిపోయే స్థితిలో ఉన్న తమ దృష్టికిసమాచారం అందిం చాలన్నారు.ఏటి వెంట అసిస్టెంట్ ఇంజనీర్ రామ్మూర్తి,లైన్ ఇన్స్పెక్టర్ దాము,విద్యుత్ సిబ్బందిపాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన గాజుల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - కార్వేటినగరం : విజయవాడలోనే జీడి నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, డాక్టర్ వి ఎం థామస్ను గురువారం అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ఎస్‌టియు నేత గాజుల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి సాలవు కప్పి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ప్రగతి కార్యాలయం నందు ఆ సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితురాలి కుటుంబ సభ్యులకు పది వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమానికి దాతగా రమేష్ బెకరీ అధినేత వ్యవహ రిం చారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడి వేటి చంద్ర శేఖర్ మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందిం చుకోవా లన్నా రు. భాధితు రాలికి అండగా ఉంటా మన్నారు. అనంతరం దాత ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ప్రిన్సిపల్ శ్రీనివా సులు, మురళినాయుడు , రాము రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్ ,కుమార్ నాయుడు , పిల్లే లాశ్రీనివాసులు ,శ్రీహరి కృష్ణారెడ్డి మల్లికార్జున్, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార జీవితాలలో వెలుగులు నింపిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

విశాలాంధ్ర - తడ : గత ఐదేళ్లు పరిపాలించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మత్స్యకార జీవితాలలో వెలుగులు నింపాలని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొ న్నారు. గురువారం తడ మండల మత్యకార నాయకులు మండల వైఎస్ఆర్ పార్టీ మండల కన్వీనర్ ఆర్ముగం అధ్యక్షతన స్థానిక ఎస్ ఆర్ ఏం గ్రాండ్ హొటల్లో జరిగిన అంతర్జాతీయ ముత్యకార దినోత్సవం సంద ర్భంగా కిలివేటి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పరిపాలిం చిన మన ప్రియతమ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి మత్స్యకార జీవితా లలో వెలు గులు నింపారని పులికాట్‌లో ముఖద్వారం పూడిక తీత కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 97 కోట్ల రూపా యలు నిధులను మంజూరు చేయించారని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి సహ కారంతో ఈ నిధులు మంజూరు చేయిం చారని రాష్ట్ర ప్రభుత్వం యాభైశాతం కేంద్ర ప్రభుత్వం యాభై శాతం నిధులతో పనులు చేపట్టే విధంగా మంజూరు అయ్యిందని కానీ నేడు కూటమి ప్రభుత్వం మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుం టున్నారని ఏది ఏమైనా ముఖద్వారం పనులు మొదలు పెట్టి పూర్తి చేస్తే చాలని మత్యకారుల జీవితాలలో వెలుగు నింపి ఆ క్రెడిట్ వారికి దక్కినా పర్లేదని పులికాట్ సరస్సు లో ముఖ ద్వారం పూర్తిచేస్తే చాలని మత్యకారులకు మంచి జరగాలని కోరుకుం టున్నట్లు తెలిపారు.ఆ నాడు మత్యకారుల కు 4 వెలు వున్న మత్యకార భరోసా 10 వెలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారి కే సాధ్య పడిందని .కూటమి ప్రభుత్వం మత్యకారుల కు ఇస్తానన్న 20 వేల రూపా యలు ఎప్పుడు ఇస్తారో తెలియ లేదని చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభు త్వం కాదని ఎద్దేవా చేశారు. మత్యకార నాయకులను మంత్రిగా, టీటీడీ మెం బర్గా,రాజ్యసభకు పంపిన వ్యక్తిగా,మత్య కారుల మేలు కోరిన వ్యక్తిగా జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుం దని తెలిపారు .మంచి ప్రభు త్వం అని గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వం ఊరు వాడా మొత్తం, వీధి వీధికి బెల్ట్ షాపు తెచ్చిన ప్రభుత్వంగా పేరు తెచ్చుకు న్నారని, ఉచిత ఇసుక అంటూ నాయకుల జేబులు నింపుకుం టున్నారని ఎద్దేవాచేశారు. పొర్లు కట్టలను తెగ్గొట్టి ఇసుక ను కొల్ల గొడుతున్నారు అని అడిగే వారే లేకుండా పోయిందని పోలీసులు సైతం నిమ్మకు నిరెత్తి నట్లు ఉన్నారని,ఆంధ్ర రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని అన్నారు.ఈ కార్య క్రమంలో తమిళ నాడు మత్యకార నాయకుడు శివలింగం,ఆంధ్ర పులికాట్ మత్స్య కార నాయకులు రాజేంద్రన్, రమేష్,సుందరం ,వాసు మొదలి యార్,జాన్‌శశికుమార్, మత్స్య కారనాయకులు పాల్గొన్నారు.

ఈశ్వరయ్య కాలనీలో పోలీసుల విచారణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్య కాలనీలో పోలీసులు విచారణ చేపట్టారు. విశాలాంధ్రలో గురువారం 'ఈశ్వరయ్య కాలనీలో దొంగల బెడద' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై శ్రీకాళహస్తి గ్రామీణ సీఐ రవి నాయక్ స్పందించారు. తమ సిబ్బందిని ఈశ్వరయ్యకాలనీలో విచారణకు పంపారు. ఈశ్వరయ్య కాలనీలో ఉన్న మాజీ నక్సలైటు శంకరరెడ్డి ఇంటికి పోలీసులు వెళ్లారు. దొంగలు చోరీకి ఎలా ప్రయత్నించి విఫలమయ్యారో ఆయన నుంచి ఆరా తీశారు. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే తమకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఇందుకు శంకరరెడ్డి అంగీకరించారు. పోలీసులు వచ్చి విచారణ చేయడంతో ఈశ్వరయ్య కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం కూరగాయల మార్కెట్ వద్ద గల ఆక్రమణలను గురువారం పురపాలక అధికారులు తొలగించారు. గతంలో కూడా ఇక్కడ ఉన్న ఆక్రమణలు పురపాలక అధికారులు తొలగించారు. అయితే అప్పట్లో ఇది వివాదమైంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసినా పురపాలక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ దుకాణాలు తొలగించాలంటూ ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. మూడు నెలల లోపు ఆక్రమణలు తొలగించాలని న్యాయస్థానం పురపాలక అధికారులను ఆదేశించింది. ఆక్రమణ దారులకు ఈ విషయం పురపాలక అధికారులు చెప్పారు. అయినా వారు దుకాణాలు తొలగించలేదు. దీంతో పురపాలక కమిషనరు బీఎస్ గిరికుమార్ చర్యలకు ఉపక్రమించారు. కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం వారిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారిణి వి.శారద తమ సిబ్బందితో వెళ్లి కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించారు. మిగిలిన ఆక్రమణలు కూడా తొలగిస్తామని శారద చెప్పారు.

గోకులం షెడ్డుల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

పిడి డ్వామా ఏ.రవికుమార్

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి, మాదనపల్లి గ్రామపంచాయతీలలో జరుగుతున్న గోకులం షెడ్డుల నిర్మాణాలను గురువారం పథక సంచాలకులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎ. రవి కుమార్ పరిశీలించారు. గోకులం షెడ్డు ల నిర్మాణంలో మండలంలో అందరు క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే రైతులను సంప్రదించి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దపంజాణి ఎంపీపీ రెడ్డప్ప పాల్గొన్నారు ఎలాంటి అవకతవలు పాల్పడకుండా ఉపాధి హామీ పనులు నిర్వహించాలని గోకులం షెడ్డు లను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసుకోవాలని ఈ మేరకు రైతులకు అవగాహన కలుగజేయాలని ఆయన ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మండలానికి 175 గోకులం షెడ్డులు మంజూరు అయ్యాయని అయితే 70 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని ఇంకా ప్రారంభం కాని వాటిని వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీవో బాలాజీ ఉపాధిహామీ ఏపిఓ మురుగేషన్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నాగమణి ఉపాధి హామీ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

జగన్‌కు కుటుంబ బంధాలు, అనుబంధం గురించి మాట్లాడే అర్హత లేదు

జిల్లా టిడిపి నేతలు

విశాలాంధ్ర-చిత్తూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కుటుంబ బంధాలు అనుబంధ గురించి మాట్లాడే అర్హత లేదనీ రాష్ట్ర టీడీపి అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్‌లు ఆరోపించారు గురువారం చిత్తూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అబద్దాలు అసత్యాల ఎపిసోడ్-4లో చంద్రబాబు నాయుడు తల్లిదండ్రులు వారి అనుబంధం గురించి మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా అండిస్తున్నట్టు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుండి రికార్డింగ్ లైవ్ ద్వారా మీడియాలో తన చెల్లిని తల్లిని తన కుటుంబ సభ్యుల గురించి అబద్దాలు మాట్లాడుతున్నారు అని చంద్రబాబుకు కూడా కుటుంబం ఉన్నదని చంద్రబాబు నాయుడు ఆయన తల్లిదండ్రుల ను ప్రజలకు ఏనాడైనా పరిచయం చేశారా, మూడు పూటల అన్నం పెట్టారా అని మతి భ్రమించి పిచ్చి ముదిరి మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి పై సుమోటోగా పోలీస్ కేసు నమోదు చేసి మెంటల్ హాస్పిటల్‌కు తరలించి అతని యొక్క మానసిక స్థితి పైన వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం పోవడం ఒకవైపు మరోవైపు గత ఐదు సంవత్సరాల వైసీపీ రాక్షస పరిపాలనలో వైసీపీ పార్టీకి చెందిన కొందరు సోషల్ మీడియా సైకోలు రాజకీయ ప్రముఖుల పైన, ప్రజా ప్రతినిధుల పైన, మహిళల పైన, న్యాయమూర్తులపైన, న్యాయస్థానాల తీర్పులపైన, సోషల్ మీడియా వేదికగా అసభ్యకరంగా, చెప్పరాని విధంగా, ఆత్మాభిమానం దెబ్బ తినే విధంగా, చట్ట ఉల్లంఘనలతో కూడిన పోస్టులు పెట్టిన వైసిపి దుర్మార్గుల పైన కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి చట్ట పరమైన చర్యలకు ఉపక్రమించి తప్పు చేసిన వారిని జైలుకు పంపించడం ప్రారంభించి అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేయడం చూసి ఓర్వలేక దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తండ్రి పదవిని అడ్డం పెట్టుకొని వేల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేసిన జగన్మోహన్ రెడ్డిని ఈడి కేసులు, అవినీతి కేసులు వెంటాడడం, సుప్రీంకోర్టు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించడంతో జగన్మోహన్ రెడ్డి జీర్ణించుకోలేక, ఫ్రస్టేషన్ తట్టుకోలేక చంద్రబాబు నాయుడు కుటుంబం వారి తల్లిదండ్రుల అనుబంధాల గురించి మాట్లాడడం విడ్డూరంగా వింతగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి మానక స్థితిపై ప్రజలు నవ్వు కుంటున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నాం మీ తాత, మీ నాన్న ఫ్యాక్షనిస్టు కుటుంబం నుంచి పుట్టిన నీవు కూడా ఫ్యాక్షనిస్టు ముఖ్యమంత్రిగా పరిపాలించావు, నీకు చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హత లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేసిన కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోండి

-ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని జండా మాన్ వీధిలో ఉన్న శ్రీ బాసర డిఎస్సీ కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ సిపిఐ పట్టణ కార్యదర్శి మహేష్ దళిత గిరిజనసంఘం నందయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తానని చెప్పడంతో అనేకమంది విద్యార్థి విద్యార్థులు కోచింగ్ సెంటర్ చుట్టూ తిరుగుతూ ఎలాగైనా ఉత్తీర్ణత సాధించాలని ఆశపడ్డారు అందులో భాగంగానే పుత్తూరులో ఉండే బాసర డిఎస్సి కోచింగ్ సెంటర్ అవకాశంగా తీసుకొని వివిధ రూపాల్లో పత్రిక ప్రకటన బ్యానర్లు కరపత్రాలు గోడ పత్రికలు వేసి విద్యార్థులను మా కోచింగ్ సెంటర్ లో చేరితే మంచి అవకాశాలుంటాయని భ్రమించి ఒక్కొక్కరి దగ్గర 5000 నుండి 15000 వరకు డబ్బులు కట్టించుకున్నారు. విద్యార్థులు తరగతులు ఎప్పటినుండి మొదలు పెడతారని అడుగుతుంటే దాటవేస్తూ వస్తూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. కొన్ని రోజుల తర్వాత వెళ్తే కోచింగ్ సెంటర్ మూసివేస్తున్నది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపారు. కావున ఆ కోచింగ్ సెంటర్ యాజమానంపై క్రిమినల్ కేసు పెట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

రేణిగుంట విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టికెట్ల సంఖ్య పెంపు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: రేణిగుంట విమానాశ్రయంలో ప్రతిరోజూ జారీ చేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల సంఖ్యను టీటీడీ 100 నుండి 200కు పెంచింది. ఈ మేరకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు టికెట్లను బుక్ చేసుకోవచ్చు. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు. అలాగే తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న శ్రీవాణి టికెట్ కౌంటర్‌లో ఆఫ్ లైన్‌లో జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుండి 800కు తగ్గించడం జరిగింది. మొదటి వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఈ టికెట్లను జారీ చేస్తారు. కాగా ఈ విధానం రేపటి నుండి అమలులోకి రానుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.

ఎరువులు పురుగు మందులు దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో సూళ్లూరుపేట, దొరవారి సత్రం, తడ మండలంలో ఉన్న ఎరువులు పురుగుమందులు దుకాణాలు గూడూరు, గోపి నాయక్‌చే తనిఖీ చేపట్టడం జరిగింది. ఈ తనిఖీలు ఏవోలు ఎన్ కవిత, ఏ.జ్యోతిర్మయి, కిరణ్ ఉన్నారు. ఎరువులు నిర్దేశించిన ధరల మేరకే అమ్మాలి మరియు బిల్లులు తప్పనిసరిగా రైతులకి ఇవ్వాలి అని దుకాణ దారులకు సూచనలు చేశారు మరియు స్టాక్ రిజిస్టరు ఎరువుల స్టాకు మరియు బిల్ బుక్కులు వెరిఫై చేశారు. ప్రస్తుతం స్టాక్ ఉంది మిషన్‌లో ఎంటర్ చేయకుండా ఉన్న 9.5 లక్షలు విలువగల ఎరువులను నిలుపుదల చేయడమైనది తదుపరి వాటిని సరిచేసి విడుదల చేసుకోవాల్సిం దిగా ఆదేశించారు. అదేవిధంగా పురుగుమందులు దుకాణాలలో రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు.

మహిళలందరూ తప్పనిసరిగా మామోగ్రామ్ చేయించుకోవాలి

దాసుకుప్పం వైద్యాధికారి డాక్టర్ ఎన్.గుణశేఖర్

విశాలాంధ్ర-సత్యవేడు: మహిళలందరూ తప్పనిసరిగా మామోగ్రామ్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని దాసుకుప్పం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాధికారి గుణశేఖర్ సూచించారు. గురువారం సత్యవేడు పట్టణంలోని రెండవ సచివాలయం, పుదుకుప్పం గ్రామంలో సర్పంచులు మంజుల రమేష్, దేవేంద్రన్ అధ్యక్షతన స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా శిబిరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఎంపీటీసీ సరవన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ను ప్రాథమిక దశలో గుర్తించాల్సి ఉందన్నారు. అందువల్ల వయస్సు 35 ఏళ్ల దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించు కోవాలని ఆయన కోరారు. దాసుకుప్పం వైద్యాధికారి డాక్టర్ ఎన్.గుణశేఖర్ కోరారు. తదనంతరం రోగులను స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ వైద్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత బృందం ప్రాథమికంగా పరీక్ష చేశారు. అనంతరం పింకు బస్సు ద్వారా మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం వైద్యాధికారులు డాక్టర్ బి.మురళీకృష్ణ, ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి మాధవి, మునిరవికుమార్, ఎంఎల్ హెచ్ పిలు మహాలక్ష్మి, మేఘన, ఏఎన్ఎంలు సుమలత, సహాయమేరి, హెల్త్ అసిస్టెంట్ షణ్ముఖం స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఖన్సాబ్ మిట్టలో వైద్య సేవలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని 29ఏ చింతమాకుల పల్లి పంచాయతీ ఖానసాబ్మిట్టలో గురువారం వైద్యాధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు అందించారు. తొలుత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం బిపి షుగర్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వ్యాధులు రాకముందే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్ కుమార్ అన్నారు. అనంతరం అంటువ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'హలో మాల చలో పలమనేరు'ను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-చౌడేపల్లి: ఎస్సి వర్గీకరణకి వ్యతిరేకంగా ఈనెల 23న పలమనేరులో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మ యుద్ధ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానికంగా వారు సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. పలమనేరు పట్టణం నందు జెండామటం కమ్యూనిటీ హాల్ లో నవంబర్ 23న ఉదయం 10 గంటలకు మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నుండి జెండామటం కమ్యూనిటీ హాల్ వరకు ఊరేగింపు నిర్వహించి అనంతరం కమ్యూనిటీ హాల్ నందు సమావేశం జరుగుతుందన్నారు. కావున చౌడేపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో మాలమహానాడు నాయకులు మాలసోదరులు ఉద్యోగస్తులు విద్యార్థి నాయకులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ కోరారు. అనంతరం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ మాలమహానాడు మండలఅధ్యక్షులు కొత్తపల్లి మణి ఉపాధ్యాక్షులు శ్రీరాములు రెడ్డిప్రసాద్ యూత్ వైస్ ప్రెసిడెంట్ మణి, జనరల్ సెక్రటరీ నక్క సురేష్ సహాయ కార్యదర్శి అంజి చెంగాలరాయులు మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆర్.మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి.రమణ మాట్లాడుతూ నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవం మొదలుకొని నవంబర్ 20 న అంతర్జాతీయ బాలల దినోత్సవం వరకు వారం రోజుల పాటు బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ వారం రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా బాలల హక్కుల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని చెప్పారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం బాలలకు ఎలాంటి హక్కులు ఇచ్చింది, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక ద్వారా ఎలాంటి హక్కులు ప్రాప్తించాయి అని వివరించారు. ఇటీవల కాలంలో పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి, బాల్యవివాహాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఓఎస్సీ అడ్మిన్ సుజాత మాట్లాడుతూ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి, సోషల్ మీడియా ఉపయోగాలు, దుర్వినియోగం గురించి వివరించారు. అనంతరం 8, 9, 10వ తరగతి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి తరగతికి ముగ్గురు విజేతల చొప్పున జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ రేణిగుంట కో ఆర్డినేటర్ జయలక్ష్మి, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఓఎస్సీ సిబ్బంది సుజాత, ప్రగతి సంస్థ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో గురువారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ ను నిర్వహించారు. స్వచ్ఛ తిరుచానూరు పేరిట పంచాయతీ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీడీవో కే.రామచంద్ర, ఈఓపీఆర్డీ ఆర్.మాధురి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్టమహోత్సవం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీమరగదాంబిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో కన్నుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రుత్వికులు నిర్ణయించిన సుముహూర్తం మేరకు గురువారం ఉదయం 10:15 గంటల నుంచి 11 గంటల మధ్యలో గర్భగుడి రామలింగేశ్వరస్వామికి ఎదురుగా వందలాది మంది శివభక్తుల శివనామస్మరణలు, మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా ప్రత్యేక పూజారుల మంత్రోచ్చా రణల మధ్య నూతన ధ్వజస్తంభాన్ని శాస్రోప్తంగా పీఠంపై ప్రతిష్ట చేశారు. అంతకుమునుపు ఆలయంలో ప్రత్యేక పూజారులు ఇందూరి రవికుమార్, యోగేశ్వర్, బాలాజీ, వీరభద్రం తదితరుల బృందం ఆలయ మండపంలో మరగదాంబిక శ్రీరామలింగేశ్వర స్వామితో పాటు నవగ్రహాలు, కాలభైరవుడు, దుర్గాదేవి, దక్షిణామూర్తి తదితర ఉప దేవత మూర్తులు, గ్రామ దేవతతో సహా 21 కలశాలను ఆలయ మండపంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు హెూమం నిర్వహించారు. తదనంతరం మహిళా భక్తులు పొంగళ్ళు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించిన తర్వాత మరుగుదాంబిక రామలింగేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో స్వామిని అలంకరించి మహాఆరతి ఇవ్వడం జరిగింది. అనంతరం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ట చేసిన పీఠం వద్ద బంగారు, పంచలోహాలు, నవరత్నాలు, నవధాన్యాలు వంటి వివిధ ద్రవ్యాలను భక్తులు తడోప తండాలుగా వచ్చి సమర్పించుకొని శివ భక్తిని చాటుకున్నారు. ఈ క్రమంలోనే శివ దీక్ష వహించిన భక్తులందరూ పూజ నిర్వహించిన కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తదనంతరం 21 కలశాల తీర్థాన్ని ధ్వజస్తంభ పీఠం గోతిలో పోసిన తర్వాత శంభో శంకర హర హర మహాదేవ అంటూ నూతన ధ్వజస్తంభాన్ని భక్తులు మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షణం చేసిన తర్వాత పీఠం గోతిలో నిలిపి ఇసుకతో పటిష్టం చేసి పూజలు జరపడంతో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం పూర్తయ్యాయి. ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవమును పరిష్కరించు కొని ఆలయాన్ని సందర్శించిన భక్తులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని గ్రామ మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మురుగయ్య తదితర గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

పాఠశాలల పనివేళల పెంచ వద్దు

- ఎస్టీయూ నేత గుమ్మడి మురళి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పాఠశాలల పని వేళలు పెంచవద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గుమ్మడి మురళి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల అభ్యసన సంసిద్ధత, రవాణా సౌకర్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలల పనివేళలను పెంచడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5 నుంచి 15 కిలోమీటర్లు దూరం నుంచి విద్యార్థులు పాఠశాలలకు వస్తారన్నారు. సకాలంలో రవాణా సౌకర్యం లేకపోవడం వలన బాలికలకు భద్రత పరమైన సమస్యలు ఉత్పన్న మవుతాయన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాఠశాలల పనివేళల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని గుమ్మడి మురళి సూచించారు.

రైతుల మహాదర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పాకాల: ఈనెల 26వ తేదీన రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న మహాధర్నాలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత పిలుపునిచ్చారు. గురువారం హేమలత ఆధ్వర్యంలో పాకాల మండలంలో ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకుసరైన గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. దేశవ్యాప్తంగా పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ సౌకర్యం వర్తింపచేయాలన్నారు. చెరువులను అనుసంధానం చేసి తాగు, సాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాధర్నాలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు, నరేంద్ర, ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని గాజంకి గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడివో టి.చంద్రమౌళి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయం సిబ్బంది హాజరు పట్టికను, రికార్డను పరిశీలించరు. అలాగే తాగునిటీ సరఫరా, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా తాగునిటీ ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

హౌస్ హెూల్డ్ జియో ట్యాగింగ్ వెంటనే పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని అన్ని పంచాయతీలలో ఎన్పీసీఐ రిజిస్ట్రేషన్, వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వే, హౌస్ హెూల్డ్ జియో ట్యాగింగ్ వెంటనే పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి గురువారం ఎంపీడీవో బాలాజీ ఆదేశించారు. కొలత్తూరు వీరపల్లి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు రాజేష్, ఆంజప్ప పాల్గొన్నారు.

చిల్డన్స్ డే ఘనంగా నిర్వహించారు

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు లో భాగమైన వడమాల ఎస్‌బిఆర్ పురం గ్రామం జిల్లా పరిస్థితి ఉన్నత పాఠశాల చిల్డ్రన్స్ డే వారోత్స వాల వారి ఆధ్వర్యంలో గురువారం చిల్డ్రన్స్ డే సమావేశంలోనే ఐసిడిఎస్ సూపర్వైజర్ వై.రోజా రమణి మాట్లాడుతూ పిల్లలకు బాల్య వివాహం జరిగితే వచ్చే అనర్ధాలు రక్తహీనత మరియు పౌష్టికాహారము షెర్ట్ ఆన్ షర్టిఫీ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉమెన్ హెల్ప్ లైన్ 181 వీటిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ అవసరమని ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం జై చంద్ర సుజాత మహిళా పోలీసు మల్లేశ్వరి అంగన్వాడి టీచర్లు అంగన్వాడి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక రోడ్డు ప్రమాదంలో ఎమ్మార్పీఎస్ నేత మృతి

విశాలాంధ్ర-చౌడేపల్లి: కర్ణాటక రాష్ట్రం రాయల్పాడులో మండలం లోని ఏ కొత్తకోటకు చెందిన మాజీ సింగిల్ విండో సభ్యుడు ఎమ్మార్పీఎస్ నాయకుడు బాజిగం చిట్టిబాబు (45) మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... బాజిగం చిట్టిబాబు వివాహం నిమిత్తం మదనపల్లి నుంచి రాయల్పాడుకు టూవీలర్ పై బయలుదేరాడు. రాయల్పాడు క్రాస్ వద్ద పోలీస్ స్టేషన్కు సమీపంలో వెళుతుండగా ఏపీఎస్ఆర్టీసీ బస్సు టు వీలర్ను ఢీకొన్నది ఈ ప్రమాదంలో బాజిగం చిట్టిబాబు అక్కడికక్కడే మృతిచెందగా తన సోదరి అపర్ణ కు గాయాలయ్యాయి. ఈ మేరకు కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోలార్కు తరలించారు. ప్రస్తుతం అపర్ణ అక్కడే చికిత్స పొందుతుంది. బాసికం చిట్టి బాబుకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉండడంతో అతని మరణ వార్త వినగానే ఏ కొత్తకోటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల పలువురు ఎంఆర్పిఎస్ మాలమహానాడు నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: ఆటో బోల్తా పడి ముగ్గురు గాయాలపా లైన సంఘటన గురు వారం చౌడేపల్లి మం డలంలో చోటుచేసు కుంది. చౌడేపల్లి చుక్కా వారిపల్లి ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపు వస్తున్న ప్రయాణికులను తరలించే ఆటో బాలసముద్రంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చుక్కావారిపల్లికి చెందిన గంగులమ్మ, నీలమ్మ, వసంతమ్మలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వారిలో నీలమ్మ, గంగులమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గిరి పుత్రులకు గోవింద మాల

విశాలాంధ్ర-నాయుడుపేట రూరల్: ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార వేత్త చీర్ల చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేట, కానూరు, కాదలూరు, నెల్లూరు గ్రామాలల్లో ఉన్న గిరిజనులకు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామీ గోవిందా మాల దారణ గురువారం ఆయన చేతులమీద వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేను సూళ్లూరుపేట, నాయుడుపేట నెల్లూరు తదితర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ ఆయా ప్రాంతాలలో ఉన్న గిరిజనులకు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని వారికి దర్శనం చేయించాలని సంకల్పంతో వారందరికీ గోవిందా మాల దారణ చేయించామన్నారు. నేను గత 16 సంవత్సరాలుగా గోవిందా మాలలు వేయిస్తున్నానని ప్రతి సంవత్సరం 1లక్ష నుంచి 2 లక్షల వరకు తన స్వంత నిధులు ఖర్చు అవుతాయని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనుల ఆర్థిక బలహీనతను ఆసరగాతీసుకొని అన్యమతస్థులు వారికి అనుకులంగా మార్చుకొని వారిని మతమార్పిడిలు చేసి వారిని సర్వం కూల్పోయేలా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలా అన్య మతాల వైపు గిరిజనులను పోనియకుండ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిని దర్శనం చేయించడంలో నాకు తృప్తి ఉంటుందన్నారు ప్రతి సంవత్సరం కాలి నడకన అన్ని ప్రాంతలనుంచి సుమారు 400 మందికి గోవిందా మాలదారణ చేసి గోవిందుని దర్శింపజేసీ తనవంతుగా సనాతన ధర్మాన్ని కాపడుతున్నానని ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాలలో నివసించే దళితులు, గిరిజనులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట ప్రముఖ హస్తరేఖ జ్యోతిష్యులు ఎంవి రమణ, విజయ్, సాయి, స్థానికులు తదితరులు ఉన్నారు.

కుప్పంలో కిడ్నాపింగ్ గ్యాంగ్ కలకలం

- కేసును ఛేదించిన కుప్పం రూరల్ పోలీసులు
- ఏడుగురు అరెస్ట్, కారు సీజ్

విశాలాంధ్ర-కుప్పం: రామకుప్పం మండలంలో 14వ తేదీ అర్ధరాత్రి సమయంలో రామకుప్పం మండలం, పెద్ద కురబలపల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప, అతడి కుటుంబ సభ్యులను కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాపింగ్ చేసి మూడు వాహనాలలో తరలించిన వారిని 21న రామకుప్పం మండలం, బంధార్లపల్లి సర్కిల్ లో ముగ్గురిని మరియు ఒక వాహనాన్ని అలాగే అన్నవరం సర్కిల్లో నలుగురు వ్యక్తులను కుప్పం రూరల్ పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది. డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళ్తే రామకుప్పం మండలం పెద్ద కురబలపల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప తమ్ముడు జయ రఘురాం దగ్గర రైస్ పుల్లింగ్ ద్వారా వచ్చిన 2,000 రూపాయల నోట్ల కట్టలు దాదాపు 100 కోట్లు ఉన్నాయని వాటిని ఎక్స్చేంజ్ చేస్తే యాభై శాతం కమిషన్ స్వర్ణలతకు ఇస్తానని చెప్పి కమిషన్ విషయంలో వచ్చిన తేడాల వల్ల వారికి ఒప్పందం కుదరకపోవడంతో ఈ చర్యకు బెంగళూరు కు చెందిన స్వర్ణలత, రామకుప్పం మండలం, జౌకుపల్లి చెందిన సుబ్రహ్మణ్యం, బెంగళూరుకు చెందిన నవీన్ అనువారు తిరుపతికి చెందిన అరుణ్ కుమార్ అనే వ్యక్తికి ఒక కోటి రూపాయలకు సుఫారి ఇచ్చి ఈ చర్యకు పాల్పడినారని కేసు దర్యాప్తులో తేలడం జరిగింది అని తెలిపారు. ఈ కేసులో మొత్తం 12 మంది నిందితులను గుర్తించడం జరిగింది. 12 మంది నిందితులలో ఈరోజు ఏడు మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింది. అరెస్టు కాబడిన వారిలో చిత్తూరు జిల్లా పులిచర్లకు చెందిన వట్టికుంట అరుణ్ కుమార్, రామకుప్పం మండలం ఉన్సిగాని పల్లికి చెందిన టి.కె.సుబ్రహ్మణ్యం, కడప జిల్లా ఎర్రగుంట్ల కు చెందిన ఖాదర్ బాషా, శివ శంకర్, పఠాన్ మాధర్ వల్లి, మంగ వరప్రసాద్, బెంగళూరు కు చెందిన నవీన్ కుమార్ లు ఉన్నట్లు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో జె.మల్లేష్ యాదవ్, సిఐ, కుప్పం రూరల్, డి.శ్రీనివాసులు, ఎస్సై, గుడిపల్లె, ఐ.నరేష్, ఎస్.ఐ, రాళ్ళభూదుగూరు పి.ఎస్, రామకుప్పం ఎస్సై వెంకట్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

విశాలాంధ్ర-ఏర్పేడు: రైతు సేవ కేంద్రాలలో యూరియాతో పాటు పంటలకు సంబంధించిన ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నట్లు ఏర్పేడు మండలం వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం చెప్పారు. ప్రభుత్వం అందుబాటులోకి రైతులకు ఎరువులను ఉంచడం జరిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపుని చ్చారు. పాతవీరాపురం రైతు సేవ కేంద్రంలో 200 బస్తాల యూరియా (కోరమండల్) రైతులకు అందుబాటులో ఉందనీ 45 కిలోల బస్తా ధర రూ.266.50 లతో రైతులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ అధికారి షణ్ముగం ఆధ్వర్యంలో ఈ విషయంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రాలలో ఉన్న యూరియాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే మళ్లీ రైతుల కోసం మరింత యూరియాను తెప్పించనున్నట్లు పేర్కొన్నారు. ఓటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అందుబాటులో యూరియా అందుబాటులో ఉండ డంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరగొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు

విశాలాంధ్ర-చిత్తూరు: తవణంపల్లి మండలం అరగొండలో శు క్రవారం నుంచి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత వాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల క్రీడ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని చెప్పారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొంటారని ఇందుకోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసామని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అందజేస్తారని తెలిపారు.

దళితరాలుకి న్యాయం చేయలేని హౌసింగ్ ఏఈని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణ వనం మండల కేంద్రంలోని పుత్తూరు మండలం తణుకు దళితవాడకు చెందిన టి.రాణి నారాయణవరం హౌసింగ్ డిపార్ట్మెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కి సమాచార హక్కుల చట్టం ద్వారా దరఖాస్తును రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం జరిగింది హౌసింగ్ డిపార్ట్మెంట్ 30 రోజుల్లో సమాచారం అందించి తన బాధ్యతలను పూర్తి చేసుకోవాలి అయితే అందుకు భిన్నంగా 60 రోజులు గడిచిన హౌసింగ్ ఏఈ పట్టించుకోకపోవడం టి రాణి కేంద్ర సమాచార కమిషన్ ఆర్డర్ కాపీ తో పాటు నారాయణవరం పోలీసులకు కి హౌసింగ్ ఏఈ పైన ఫిర్యాదు చేస్తూ బాధితురాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది సాగర విషయాన్ని పోలీసు శాఖ హౌసింగ్ శాఖ ఇరువురు నేను పంపిన దరఖాస్తులను పరిశీలించి విశాలాంధ్ర విలేకరితో టి రాణి ఆవేదన వ్యక్తపరిచారు అలాకానిపక్షంలో సోషల్ మీడియాలో నేను ప్రకటించిన విధంగా భవిష్యత్తులో నా ఉద్యమం ఉంటుందని అనారోగ్యంతో బాధపడుతున్న నేను నిరాహార దీక్ష చేసి అక్కడే మరణించిన పరవాలేదని విశాలాంధ్ర విలేఖరికి తెలియజేయడం జరిగింది ఇప్పటికైనా పోలీసు శాఖ హౌసింగ్ డిపార్ట్మెంట్ ఏఈ పైన కేసు నమోదు చేయాలని టి.రాణి అనే నేను అన్ని దస్తవేజులను కూడా విశాలాంధ్ర విలేఖరికి జిరాక్స్ కాపీలు అందించడం జరిగిందని వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నాకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ను కోరుకుంటున్నాము.

పరుశురామేశ్వర స్వామి సేవలో రాయలసీమ హోంగార్డు ఇన్చార్జ్

విశాలాంధ్ర-ఏర్పేడు: భారత దేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం శ్రీ పరుశురామేశ్వర స్వామి దేవాలయాన్ని గురువారం ఎస్పీ రాయలసీమ హోంగార్డు ఇంచార్జ్ ఎస్.మహేష్ కుమార్ సందర్శించి స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందించారు.

సామాజిక సమస్యలపై విద్యార్థులు సర్వే చేయాలి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ప్రస్తుత సమాజంలోని వివిధ గ్రామాలలో ప్రజలకు గల వివిధ రకాల ఆదాయ వనరులు, ఖర్చు వివరాలపై సమగ్రంగా పూర్తి సర్వే ద్వారా వివరాలు తెలుసుకోవడం ద్వారా సామాజిక శాస్త్ర విద్యార్థులకు సమాజం పట్ల పూర్తి అవగాహన కలుగుతుందని సోషియాలజీ విభాగం ఆచార్యులు కుసుమ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విద్యాలయం సామాజిక శాస్త్ర విభాగం విద్యార్థులకు క్షేత్ర పర్యటన రెండవ రోజు భాగంగా ఆమె దిశ, నిర్దేశం చేశారు. శేషాపురం, కందులవారిపల్లి గ్రామాలలో విద్యార్థుల చేత ఇంటింటా సర్వే చేయించి ఆరోగ్యం, ఆదాయం, పరిశుభ్రత వంటి అంశాలు గురించిన వివరాలు సేకరించారు. గ్రామాలలోని ప్రజలకు పచ్చదనం, పరిశు భ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పై గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు లభించే పౌష్టిక ఆహారంపై కూడా విద్యార్థులకు, టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ రమణయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బాబు ప్రవీణ్ కుమార్, డాక్టర్ ముకుంద నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

విశాలాంధ్ర-నాయుడుపేట: సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయం నందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని పలుసమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.సమస్యలు పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారని విజయశ్రీ తెలిపారు.

నేడు ఎస్వీయూలో మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆరోగ్య కేంద్రం జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య, డిఎస్‌డబ్ల్యుసిపి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహిళల హక్కులు ఆరోగ్య సమస్యలపై మహిళా విద్యార్థిని, పరిశోధకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం పద్మజ ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ బి.మంజుల డిస్టిక్ కార్పొరేటు ఆఫీసర్ ఎస్ లక్ష్మిలు హాజరవుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థినిలు ఆరోగ్య సమస్యలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే వివిధ గ్రూపులలో విభాగాల వారిగా ఆన్లైన్ లింకులు పంపించడం జరిగిందని వారి సమస్యలను లింకు ద్వారా తెలియజేయ వచ్చుని డాక్టర్ అలేఖ్య సూచించారు. మహిళా విద్యార్థినులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళా సమస్యలపై అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీకోదండ రామాలయాన్ని సందర్శించిన భాను ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో ఉన్న అతి పురాతనమైన శ్రీ కోదండ రామాలయంను గురువారం టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో, అర్చకులతో ఆలయ అభివృద్ధి గురించి చర్చించారు. శ్రీకోదండ రాముల వారి కళ్యాణ వేదికను నిర్మించడానికి కృషి చేస్తానన్నారు. అలాగే గాలి గోపురం, కోనేరు, వాహన మండపం, భక్తుల కోసం ఉచిత బస్ సౌకర్యం కల్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. వకుళమాత, ముక్కోటి, శ్రీకోదండ రామాలయం కలుపుతూ టెంపుల్ కారిడార్ ఏర్పాటు గురించి సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తామన్నారు. శ్రీవారిమెట్టు నడక మార్గంలో భక్తుల విశ్రాంతి కోసం శ్రీవారి సదన్ ఏర్పాటు చేస్తామన్నారు. టీటీడీ బోర్డు మీటింగ్ లో పైసమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, కొత్త పాటి మనోహర్ రెడ్డి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

రైతులు సాయిల్ హెల్త్ కార్డు పొందడి

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండల రైతులు వ్యవసాయశాఖ ద్వారా మీ పొలంలోని మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా భూసార పరీక్ష చేసి సాయిల్ హెల్త్ కార్డు అందించబడుతుంది. అన్ని పంటలకు సిఫారసు చేసిన మోతాదు మేరకు మాత్రమే సేంద్రియ రసాయన ఎరువులను పంటలకు వేసుకోవాలి. సూక్ష్మ పోషకాలు , స్థూల పోషకాలు, సేంద్రియ కర్బనము, నేల యొక్క పిహెచ్, తెలుసుకొని ఆమ్లనేలలు, చౌడు నేలలను సాగులోకి తీసుకోవాలి. ఉచిత భూసార పరీక్ష కోసం మీ దగ్గరలోని రైతుసేవకేంద్రం సిబ్బందిని సంప్రదించగలరని మండల వ్యవసాయ శాఖ అధికారి మాధవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఆంధ్రప్రదేశ్ మీడియా ఆఫీసర్‌గా శివకుమార్

విశాలాంధ్ర-పలమనేరు: నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ మీడియా ఆఫీసర్ గా పలమనేరు పట్టణానికి చెందిన కంగుంది శివకుమార్ ను ఎంపిక చేస్తున్నట్లు నేషనల్ ప్రెసిడెంట్ మాదేశ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆఫీసును నియోజకవర్గం లోని నాలుగు రోడ్ల దగ్గరలో ఉన్న కానాల ఇండ్లు దగ్గర ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాదేశ్ మాట్లాడుతూ... మీడియా పరంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళు తున్నటువంటి శివకుమార్ ను తమ సంస్థలో తీసుకోవడం చాలా ఆనందదాయకమని తెలిపారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ఎంతో విలువైన మానవ హక్కులు కాపాడే సంస్థలో తనను తీసుకోవడం మరియు తన పని చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నట్లు తనపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ మీడియా ఆఫీసర్‌గా బాధ్యత ఇవ్వడం ఆనందదాయకమని ఆయన తెలిపారు.

తిరుమల పవిత్రత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాన్ని స్థానికులకు టిటిడి పాలకమండలి పునరుద్ధరించడటం హర్షనీయమని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అలిపిరి పాదాలమండపం వద్ద నూట పదహారు కొబ్బరి కాయలు కొట్టి శ్రీవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే స్థానికులకు నెలలో మొదటి మంగళవారం దర్శనాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ చేసిన కృషి అభినందనీయమని ఆయన అన్నారు. స్థానికులకు దర్శన భాగ్యం కల్పించిన సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడులకు ప్రత్యేక ధన్యవాదాలు ఆయన పార్టీ తరుపున తెలిపారు. కాగా టిటిడిలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులు, ఫారెస్ట్ కార్మికులతోపాటు మిగిలిన విభాగాల్లోని వారికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో మంచిరోజులు రానున్నాయని ఆయన చెప్పారు. ఐదేళ్ళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చారని జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఇచ్చి మాట ప్రకారం స్థానికులకు శ్రీవారి దర్శన భాగ్యం టిటిడి కల్పించిందని ఆయన తెలిపారు. స్థానికులకు దర్శనం పునరుద్ధరించిన సిఎం చంద్రబాబు నాయుడు, టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల పవిత్రను కాపాడే విధంగా టిటిడి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటాయని ఆయన చెప్పారు. స్థానికులకు దర్శనం కల్పించే విషయంలో టిటిడి బోర్డు తొలి సమావేశంలో తీసుకోవడంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీసుకున్న చొరవే కారణమని ఆయన తెలిపారు. టిటిడి నిర్ణయాల పట్ల ప్రజల్లో మంచి స్పందన లభిస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటేశ్వర రావు, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బాబ్జీ, అన్నా యువరాజ్ రెడ్డి, రాజేష్ ఆచ్చారి, మునస్వామి, సుధా, వినోద్ రాయల్, పూసా మాధవరావు, ఆకేపాటి సుభాషిణి, దుర్గా, లతా తదితరులు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: శ్రీవారిపై భక్తి భావంతో ప్రసాదాల నాణ్యత పెంచుతూ స్థానికులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతూ అలాగే టీటీడీ పాలకమండలి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని బీసీ నాయకులు రాష్ట్ర గాండ్ల సాధికార కమిటీ సభ్యులు జగన్నాథం అన్నారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో బీసీ నాయకుల తో కలిసి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేయలేని పని ఎన్నోసార్లు వినతి పత్రాలు అందించిన ఫలితం లేకపోయిందని నేడు ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వంలో ఏర్పడిన పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు హర్షనీయమని అందులోనూ ప్రత్యేకంగా స్థానికులకు దర్శన భాగ్యం కల్పించినందుకు బీసీ కులాల నాయకులు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ మీడియా ప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తిరుపతికి రోజుకి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి పోతున్నారని విమానాలలో రైళ్లల్లో బస్సుల్లో సొంత వాహనాలలో భక్తులు వచ్చి పోతున్నారు భగవంతుని దర్శించుకునే విషయంలో అలాగే వసతుల విషయంలో గాని భక్తులకు మెరుగైన సేవలు అందించాలని నిర్ణయాలు తీసుకున్నా పాలకమండలికి స్థానికులు కృతజ్ఞతలతో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయంగా భక్తులను గౌరవంతో పలకరిస్తూ తిరుపతి ప్రతిష్టను పెంచాలని కోరారు. తిరుపతిలోని ఐదుగుళ్లకే పరిమితమైన స్థానికులకు శ్రీవారి దర్శన భాగ్యం మరలా కలిగించినందుకు మన వంతు సాయంగా భక్తితో వ్యవహరిద్దామని బీసీ కుల సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి నాయకులు జగన్నాథంతో పాటు వన్నె క్షత్రియ నాయకులు కొండా రామారావు, ముదిరాజ్ నాయకులు జ్ఞాన శేఖర్, శాలివాహన నాయకులు జ్యోతి కుమార్, చంద్రమోహన్, సురేష్‌లు పాల్గొన్నారు.

నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు న్యాయం చెయ్యండి

-ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

విశాలాంధ్ర-పుత్తూరు: అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ జీరో అవర్ (శూన్య గంట)లో నగరి నియోజకవర్గం నిండ్ర నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావించారు. నేతమ్స్ ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు సుమారు రూ. 37 కోట్లు, ఉద్యోగులకు సుమారు రూ.12 కోట్లు బకాయిలు పెట్టారని వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.గత 4 సంవత్సరాలనుండి ఫ్యాక్టరీ మూతబడి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించక పోవడం తో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఫ్యాక్టరీ వేలంకు వచ్చిందని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

ధనంజయ గౌడ్‌కు పదవీయోగం

విశాలాంధ్ర-చిల్లకూరు: సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీలో ఉండి, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, పార్టీ విధేయుడైన సీనియర్ నాయకుడు ధనంజయ గౌడ్ ను తెలుగు దేశం పార్టీ అధినేత మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మరెన్నో పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆయన మిత్రులు, సన్నిహితులు, భంధువులు ఆకాక్షించారు, అభినందించారు.

అనారోగ్యంతో గ్రామ రెవిన్యూ సహాయకుడు మృతి

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు గ్రామ రెవిన్యూ సహాయకుడు (వీఆర్ఏ) సిద్దయ్య(72) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సిద్దయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తూ ఉండేవాడు. కుటుంబ సభ్యులు ఇతనికి పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేక పోయింది. సిద్దయ్య మృతి విషయం తెలుసుకున్న తొట్టంబేడు తహసీల్దారు మధుసూదనరావు వెంటనే తొట్టంబేడుకు వెళ్లారు. సిద్దయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. సిద్దయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు వీలైనంత త్వరగా అందేటట్లు చర్యలు తీసుకుంటామని మధుసూదన రావు హామీ ఇచ్చారు. కాగా సిద్దయ్య భౌతిక కాయానికి డిప్యూటీ తహసీల్దారు జగన్మోహన్, సీనియర్ అసిస్టెంటు నారాయణ, కంప్యూటరు ఆపరేటరు సురేష్, మరికొంతమంది రెవిన్యూ సిబ్బంది కూడా నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరుకున్నారు.

మాజీ సర్పంచ్ సతీమణి మృతి

అంత్యక్రియలో పాల్గొన్న టిడిపి నాయకులు

విశాలాంధ్ర-చిట్టమూరు: మండల పరిధిలోని బురదగాలి కొత్తపాలెం మాజీ సర్పంచ్ ఎర్రబోతు సుబ్రహ్మణ్యం సతీమణి చెంగమ్మ బుధవారం మధ్యాహ్నం అకాల మరణం చెందడంతో గురువారం అంతిక్రియలో పాల్గొన్న టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గనపర్తి కిషోర్ నాయుడు మరియు కోగిలి సర్పంచ్ పోలయ, టిడిపి మైనార్టీ నాయకులు ఎస్కే రషీద్ సాహెబ్ పలువురు టిడిపి నాయకులు పాల్గొని ఎర్రబోతు సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పుడు వారి ఇంటికి వచ్చిన ఎవరినైనా ఆప్యాయంగా పలకరించే వారిని అలాంటి చెంగమ్మా చనిపోవడం చాలా బాధాకరమైన విషయమని సుబ్రహ్మణ్యం రాజకీయంగా ఎదుగుదలకు తమ వంతు ప్రోత్సాహం అందించేదని అలాంటి ఆమె చనిపోవడం టిడిపి కూడా తీరనిలోటని వారన్నారు.వారు వెంట టిడిపి నాయకులు మారం రెడ్డి జనార్దన్ రెడ్డి,టిడిపి ప్రధాన కార్యదర్శి చిన్నారావు ఎంబేటి పోలయ్య,వేగూరు గోపాలయ్య,వేముగుంట పాలెం సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కమతం వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

టాస్క్ ఫోర్స్‌ను సందర్శించిన పీసీసీఎఫ్

విశాలాంధ్ర-తిరుపతి: అటవీ శాఖ పీసీసీఎఫ్ (విజిలెన్స్) డాక్టర్ ఎస్ ఎస్ శ్రీధర్ గురువారం టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏ ఎస్టీఎఫ్) కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ స్వాగతం పలికారు. టాస్క్ ఫోర్స్ పనితీరు గురించి పీసీసీఎఫ్‌కి ఎస్పీ వివరించారు. కూంబింగ్, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు, చెక్ పోస్టులు పనితీరు గురించి విసదీకరించారు. ఇంకా టాస్క్ ఫోర్స్‌కు కావలసిన డ్రోన్ కెమెరాలపై చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి సీసీఎఫ్ సి. సెల్వం, డీఎఫ్ఓ పి.వివేక్, ఏసీఎఫ్ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ శ్రీసురేష్ కుమార్, ఎస్సై రఫీ, ఎఫ్ఆర్ఓలు మురళి, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నగర సమగ్రాభివృద్ధికి రూ.350 కోట్ల నిధులు ఇవ్వండి

– సీఎంను కోరిన చిత్తూరు ఎమ్మెల్యే

విశాలాంధ్ర –చిత్తూరు : అన్ని రకాలుగా వెనుకబడిన జిల్లా కేంద్రం చిత్తూరు నగర సమగ్రాభివృద్ధికి రూ.350 కోట్ల నిధులను కేటాయించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు విన్నవించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ని కలిసి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వారీగా నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. రెండు లక్షల పైగా జనాభా ఉన్న చిత్తూరు నగరం, విలీన పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నగర పరిధిలోని 50 డివిజన్లలో నీటి సరఫరా పైపులైన్ల కోసం రూ.45 కోట్లు.నగరపాలక పరిధిలోని అన్ని డివిజన్ల పరిధిలో అంతర్గత సీసీ, బీటి రోడ్ల నిర్మాణం కోసం రూ.90 కోట్లు.నగరపాలక పరిధిలోని 50 డివిజన్లలో మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.70 కోట్లు.నగరంలోని పార్కుల సుందరీకరణ కోసం రూ.12 కోట్లు.నగర పరిధిలోని చెరువులను పటిష్టత, అభివృద్ధి చేయడం కోసం రూ.10కోట్లు.నగరపాలక పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఫుట్ పాత్ ల నిర్మాణానికి రూ.10 కోట్లు.నగరపాలక పరిధిలో ఆధునిక విద్యుత్ దీపాలు, సెంట్రల్ లైటింగ్, హై–మాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.10 కోట్లు.పాత కూరగాయల మార్కెట్ను ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్, నాన్ వెజ్ మార్కెట్ గా అభివృద్ధి చేయడానికి రూ.3 కోట్లు.పాత బస్టాండ్ వద్ద ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన సీఎం చిత్తూరు నగర సమగ్ర అభివృద్ధి పనులు, నిధులు కేటాయింపుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.

తెలంగాణ సీఎంతో టీటీడీ చైర్మన్ భేటీ

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్: టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు ధర్మకర్తల మండలి చైర్మన్ తెలంగాణ సీఎంకు పట్టువస్త్రం అందజేశారు. అనంతరం టీటీడీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలిసిన బీఆర్ నాయుడును సీఎం రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చెంగాలమ్మను దర్శించుకున్న హైకోర్టు జస్టిస్

విశాలాంధ్ర–సూళ్లూరుపేట: శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ డా. కృపా సాగర్ కుటుంబ సమేతముగా దర్శించుకొన్నారు. వారిని సహాయ కమీషనరు కార్యనిర్వాహణాధికారి బి.ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం వేద పండితులచే శ్రీ అమ్మవారికి పూజలు నిర్వహించన తదుపరి వేదపండితులచే ఆశీర్వచనము చేయుట జరిగినది. ఈ కార్యక్రమములో ఆర్డిఓ, ఈ.కిరణ్మయి, సూళ్ళూరుపేట జడ్జి అనిల్ కుమార్, తహసీల్దార్. నరసింహ రావు, మురళి క్రిష్ణ, బ్రాహ్మణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచండి

నీటి సాంద్రత పరీక్షలు తప్పక నిర్వహించండి

– కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర – తిరుపతి : నగరంలో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్న పార్కుల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని వినాయక సాగర్ లో పారిశుధ్య పనులను, త్రాగునీటి సాంద్రత పరీక్షలను గురువారం ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి కమిషనర్ తనిఖీ తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్ లో నీటి పై పేరుకు పోయిన చెత్త ను తొలగించాలని, అలాగే వాకింగ్ ట్రాక్ పరిసర ప్రాంతాల్లో ప్రతిరోజూ చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులను నియమించి ప్రత్యేకంగా నిత్య పర్యవేక్షణ చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వాకర్స్ తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆటోనగర్, తదితర ప్రాంతాల్లో నీటి సాంద్రత పరీక్షలను తనిఖీ చేశారు. నగరంలో ఎక్కడ కలుషిత నీరు అనే మాట రాకూడదని, ప్రతి రోజూ తప్పకుండా నీటి సాంద్రత పరీక్షలు నిర్వహిం చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. రమణ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, ఏ.ఈ.కామ్. ప్రతినిధులు బాలాజి, అనిల్, తదితరులు ఉన్నారు.

26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి

– కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధం కండి

– సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపు

విశాలాంధ్ర – గూడూరు: గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఈనెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని సీపీఐ నాయకు లు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యావత్తు ప్రజానీకం పోరాటాలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం శరవేగంగా ప్రజా వ్యతిరేక విధా నాలను అవలం బిస్తుందని అందులో భాగంగానే విద్యుత్ చార్జీల పెంపుదల, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ రాష్ట్రంలో శరవేగంగా అమలవుతున్నా యని అలాగే ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలుపరిచేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధం కావడంలేదని తెలిపారు. దేశంలో 500 జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగు తున్న ధర్నా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ 26వ తేదీన జరిగే తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నా కార్యక్ర మంలో పెద్ద ఎత్తున జిల్లా ప్రజానీకం పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఈనెల 26న రైతు కార్మిక సంఘాలు చేపట్టే ఆందోళనకు జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీరాములు, సీపీఎం పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు చంద్రయ్య, రైతు సంఘం జి.రమేష్, రైతు పార్థయ్య, మునిరత్నం నాయుడు, సీపీఎం ముత్యాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు ఫిబ్రవరి నెల కోటా విడుదల

విశాలాంధ్ర–తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా 2025 ఫిబ్రవరి నెల కోటాను గురువారం టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన ఫిబ్రవరి నెల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. నవంబరు 23న అంగప్రదక్షిణం టోకెన్లు ఫిబ్రవరి నెలకు సంబంధించిన అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను నవంబరు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన ఫిబ్రవరి నెల ఆన్ లైన్ కోటాను నవంబరు 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోట వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు న్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఫిబ్రవరి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను నవంబరు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. నవంబరు 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల ఫిబ్రవరి నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను నవంబరు 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల తిరుమల, తిరుపతిలలో ఫిబ్రవరి నెల గదుల కోటాను నవంబరు 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthan ams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.